
లెండుగురే కృష్ణకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జడ్పీ వైస్ చైర్మన్

## బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకుడు

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, అక్టోబర్ 5: కాగజ్‌నగర్ మండలం చింతగూడ కోయవాగు గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు లెండుగురే కృష్ణ జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. ఇతనికి జెడ్పీ వైస్ చైర్మన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లెండుగురే కృష్ణ బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న లెండుగురే శ్యామ్‌రావు సోదరుడు లెండుగురే పటేల్‌కు స్వయానా కుమారుడు కావడం విశేషం. ఈ సందర్భంగా లెండుగురే కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనప్ప సిర్పూర్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం


డబ్బా గ్రామంలో పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్ఐ

చింతలమానేపల్లి, అక్టోబర్ 5 : మండలంలోని డబ్బా, దరొగపల్లి గ్రామంలో గురువారం ఎస్ఐ వెంకటేశ్ నిరుపేద కుటుంబానికి చెందిన లొంబడి పుణాజి 7 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో చనిపోగా భార్య కమల తన ఇద్దరు కుమారులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా వారికి నిత్యావసర సరుకులతోపాటు రూ.3 వేల నగదు అందజేశారు. ఈసందర్భంగా ఎస్ఐ వెంకటేశ్‌కు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఎస్ఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్, తుమోజు వెంకటేశ్, గుర్లే అశోక్, కావుడే సాయి కిరణ్, సురేశ్, రాజమౌళి, దేవరావు, గ్రామ యువకులు, యూత్‌సభ్యులు, సిబ్బంది ఉన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, నాయకులు

దహెగాం,అక్టోబర్5: మండలంలోని ఇట్యాల గ్రామపంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్, నాయకులతో కలిసి గురువారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతుఊ.. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మురారి, ఎంపీటీసీ గజ్జల జయలక్ష్మి, నాయకులు గజ్జల సురేశ్ ,టాకెరె భీమయ్య, వశాక తిరుపతి, గౌతురె చంద్రయ్య,ఎస్‌కె షకీల్, రోర్ల, నాగేశ్ పాల్గొన్నారు.

## వారసంతలో అన్నదానం


గోలేటి వారసంతలో అన్నదానం చేస్తున్న గోలేటి యూత్ సభ్యులు

రెబ్బెన, అక్టోబర్ 5: గోలేటి గ్రామ పంచాయతీలో ప్రతి గురువారం నిర్వహించు వారసంతలో గోలేటి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించినట్లు యూత్ సభ్యులు వసీం, భరత్, మొయిజ్, సైఫ్, సందీప్ తెలిపారు. ప్రతి గురువారం జరిగే వారసంతకు దూర ప్రాంతాల నుంచి చాలా మంది వస్తుంటారని వచ్చే ,వారు అకలితో ఇబ్బంది పడవద్దని అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- జడ్పీ వైస్ చైర్మన్ కృష్ణారావు
- ఆయా గ్రామాల్లో సుడిగాలి పర్యటన
- అభివృద్ధి పనులకు భూమిపూజ
- కాగజ్‌నగర్‌లో బతుకమ్మ చీరెల పంపిణీ


ఆరే సంఘం భవన నిర్మాణానికి రూ .15లక్షల ప్రొసీడింగ్ కాపీని సంఘం నాయకులకు అందజేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్

సిర్పూర్(టీ), అక్టోబర్ 5 : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని అన్ని వర్గాలకు, కులాలకు సముచిత న్యాయం జరుగుతుందని జడ్పీవైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని డౌనల్ ప్రాంతంలో ఆరే సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి మండలంలో ఆరె సంఘం భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 15 లక్షల ప్రొసీడింగ్ కాపీని ఆరె సంఘం నాయకులకు అంద జేశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి, అందుబాటు లోకి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట మండల కోఆప్షన్ సభ్యుడు కీజర్‌హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు యాదగిరి బ్రహ్మయ్య, అఖిల్, శ్రీనివాస్, ప్రసాద్, సంఘం నాయకులు నానాజీ, కీశోర్, లాలాజీ పాల్గొన్నారు.

**• మున్నూరు కాపు సంఘానికి రూ.25 లక్షలు**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 5: పట్టణంలోని కాపువాడలో ఉన్న మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్‌లో అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే కోనప్ప రూ.25 లక్షలు మంజూరు చేశారు. ఆ మంజూరు పత్రాన్ని జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు క్రిష్ణారావు గురువారం మున్నూరు కాపు సంఘం కమిటీకి అందజేశారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యే కోనప్పను గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా జడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు క్రిష్ణారావు, మున్నూరు కాపు సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**• సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 5 ; కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలో జడ్పీవైస్ చైర్మన్ కోనేరు క్రిష్ణారావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి మంజూరైన 15 లక్షల ప్రత్యేక నిధులతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. అనంతరంలో ప్రభుత్వం బతుకమ్మ కానుకగా ఆడబిడ్డలకు అందజేస్తున్న బతుకమ్మ చీరెలను నాయకులతో కలిసి మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మెంబర్ సిద్దిఖ్, కోసిని సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**• అభివృద్ధి పనులు ప్రారంభం**

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, అక్టోబర్ 5 : కాగజ్ నగర్ మండలం చింతగూడ కోయవాగు గ్రామాల్లో గురువారం జడ్పీవైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా కోయవాగు చింతగుడా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భుమిపూజ నిర్వహించి పనులను ప్రారభించారు. అనంతరం కోయవాగు చింతగూడ గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ కానుకగా అందజేస్తున్న చీరెలను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అందజేస్తున్న క్రీడా సామగ్రిని స్థానిక నాయకులతో కలిసి క్రీడాకారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సిద్దిక్, సర్పంచ్ లక్ష్మి, మండల కో–ఆప్షన్ మెహబూబ్ ఖాన్, ఎంపీటీసీ ఆస్మ కలీం భేగ్, మండల ఎంపీపీ శంకర్, వార్డుసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు నాగేందర్, కలీం భేగ్ పాల్గొన్నారు.


కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ: మహిళలకు బతుకమ్మ చీరెలను అందజేస్తున్న జడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు


కోసినిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

# బౌద్ధ ఆత్మీయ సభను విజయవంతం చేయాలి

బెజ్జూర్, అక్టోబర్ 5 : ఈ నెల 8న (ఆదివారం) బౌద్ధ సమాజ్ సంఘం తాలూక అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో కౌటాల మండల కేంద్రంలో నిర్వహించనున్న బౌద్ధ సమాజ్ సంఘ ఆత్మీయసభను విజయవంతం చేయాలని తాలూక సంఘ సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం సభకు సంబంధించిన కరపత్రాల పంపిణీలో భాగంగా నియోజకవర్గంలోని పలు మండలాల్లో వారు పర్యటించారు. ఈ నేపథ్యంలో బెజ్జూర్ మండల కేంద్రంలోని సంఘం మండలాధ్యక్షుడు, బౌద్ధ బాంధవులను కలిసి సభకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో బౌద్ధ మత ప్రచారంలో గ్రామ కమటీలు, మండల కమిటీల పాత్ర, వర్షవాస్ వేడుకల గురించి, ధర్మచక్ర పరివర్తన్ దివస్ వేడుకలకు సంబంధించిన విషయాలతో పాటు పలు కీలక అంశాల విధి విధానాలపై చర్చలు జరుగనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా బెజ్జూర్ మండలం నుంచి బౌద్ధ బాంధువులు, అంబేద్కర్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు శ్యాంరావు దుర్గు, దిలీప్ ఝూడె, బండూరావు పుల్‌జలే, కుమ్మరి పోశన్న, దాగావ్ కార్ పత్రు, దాగం ఆగయ్య, ధన్‌రాజ్ ఖోబ్రబడే, భీంరావు దుర్గె తదితరులు పాల్గొన్నారు.


మండల కేంద్రంలో సభ్యులకు కరపత్రాలు అందజేస్తున్న తాలూక సంఘం సభ్యులు

## మహిళ అదృశ్యం

చింతలమానేపల్లి, అక్టోబర్ 5 : మండలంలోని దిందా గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. దిందా గ్రామానికి చెందిన అగుమారి దివ్య( సుజాత) (22) అనే మహిళ ఈనెల 2 నుంచి కనపడడం లేదన్నారు. దివ్యకు 10 సంవత్సరాల క్రితం దిందా గ్రామానికి చెందిన అగుమారి తిరుపతితో వివాహం కాగా ఇద్దరు కుమారులు ఉన్నారు. వారం రోజుల నుంచి తరుచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో ఈనెల 2 నుంచి సుజాత కనిపించకుండా పోయింది. గ్రామంలో ఎక్కడ వెతికినా ఆచూకి లభించకపోవడంతో భర్త తిరుపతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఆడబిడ్డలకు అండగా కేసీఆర్

- ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ

కౌటాల, అక్టోబర్ 5: ఆడబిడ్డలకు అండగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలుస్తున్నారని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పార్డీ, గుడ్లబోరి, మొగడ్‌ధగడ్, వీరవెల్లి, సాండ్‌గాం, గ్రామాల్లో ఆ యా గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి తెలంగాణ ప్రభు త్వం ఆడబిడ్డలకు ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరెలను మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడబిడ్డల ఆత్మగౌరవ పండుగ బతుకమ్మ అని, దానికోసం ఆడబిడ్డలకు అందమైన నాణ్యత గల చీరెలను ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. అంతే కాకుండా రాష్ట్రంలో దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ సారును భారీ మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.


గుడ్లబోరిలో బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ